# గురుగు

"నా పేరు...." చెప్పబోతోంటే...

"నాకు తెలుసు. ఇప్పటికి నువ్వే ఆరేడుసార్లు చెప్పావు" అన్నాను. రెండు క్షణాలు ఆగి తల అటూ ఇటూ కదిపాడు. మాటల్లో ఉండుండి తల కదపడం అతని అలవాటు అనుకుంటాను. చెప్పడం మొదలెట్టాడు.

"నేను నా పేరంత గొప్పవాడి నవుతానేమోనని మా అమ్మా నాన్న నాకు పేరు పెట్టి ఉండాలి. ఆ పేరు నాకింత వరకు సార్థకం కాలేదు. ఈ పరిస్థితుల్లో అవుతుందని నేను అనుకోవడం లేదు. ఆ పేరుతో నన్నెవరయినా పిలుస్తున్నపుడు సంతోషంగా ఉంటుంది. గర్వంగా ఫీలవుతాను.

"మా ఊళ్లో డాక్టరు లక్ష్మీకాంతం ప్రసూతి వైద్యశాలకు మంచి పేరుంది. అవసరం అయితేనే తప్ప ఆ డాక్టరు సిజేరియన్ ఆపరేషన్లు చేయరు. ఇరవయి అయిదు సంవత్సరాల కిందట ఆ ఆస్పత్రిలో పుట్టాను. అమ్మకు అది మామూలు కాన్పు. ఆ తర్వాత అమ్మకు సంతానం కలగలేదు.

"ఆ ఆస్పత్రిని ఆనుకుని 'మోటార్ బయిక్ రిపేర్ పాయింటు' ఉండేది. ఇప్పుడు అది లేదు. నాలాటి వాడు ఎవడయినా వచ్చి దాన్ని పాడుచేశాడో లేక అదే పాడుబడిపోయిందో తెలియదు. దాని బోర్డు ఇంకా ఆస్పత్రి పక్కనే ఉంది. అసలది ఆస్పత్రి పక్క ఉండవలసింది కాదు. నేను పుట్టీ పుట్టగానే అరగంటకు పయిగా మోటర్ బయిక్ శబ్దం చెవులు పోయేంత ఎక్కువగా ఉందట. ఆ శబ్దానికి నా చెవులు దెబ్బతిని ఉంటాయని నేను పెద్దవాడినయ్యాక మాటల్లో మా అమ్మ నాతో చాలాసార్లు అంది. ఆ సమయంలో ఆ శబ్దం వినిపించకుండా కిటికీ తలుపులు మూసి వేయాలని ఎవరికి ఎందుకు తట్టలేదో? మొదటి సంతానంగా అబ్బాయి

పుట్టాడని ఆనందంలో పడిపోయి ఉండాలి. నా సంగతి కొద్దిగా పట్టించుకుని ఉన్నా అందరిలా నిక్షేపంగా ఉండేవాడిని.

"ఏ మాటయినా నాతో పెద్దగా చెబితేనే గాని సూదంత మటుకు వినబడుతుంది. ఎదుటి వాళ్ల పెదాల కదలికలతో వాళ్లు ఏం మాట్లాడుతుందీ అర్థం చేసుకోగలను. సంజ్ఞలు బాగా ఫాలో అవుతాను. కొద్దిగా మాట్లాడగలను. స్పష్టంగా ఉన్నట్టు అనిపించదు. అమ్మకు, నాన్నకు, నాకు దగ్గరగా ఉండేవాళ్లకు తప్ప వేరేవాళ్లకు అవి అర్థం కావు. తొంబయి అయిదు శాతం బధిరుడిని.

"ఏ కార్యక్రమానికి అయినా అమ్మానాన్న నన్ను తీసుకు వెళ్తారు. అందరితో కలివిడిగా మెలగాలని ఉంటుంది. ఆప్యాయంగానే పలకరిస్తాను. 'బావున్నావా' అని అడుగుతారు. నా మాట నాకు వినిపించదు. పలకరించిన వాళ్లతో మరికొంతసేపు మాట్లాడాలనిపిస్తుంది. ఎవరో తప్ప ఓపికగా నాతో మాట్లాడరు.

"అమ్మ ప్రతి కార్యక్రమంలో పాల్గొనడానికి చాలా ఆసక్తి చూపుతుంది. రాష్ట్ర ప్రభుత్వంలో హోదా ఉన్న ఉద్యోగం ఆమెది. ఆఫీసు నవుకర్లు ఇంటికొచ్చి పనులు చేస్తుంటారు. నాన్న కేంద్ర బీమాసంస్థలో రీజనల్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరికీ సమాజంలో, మరీ ముఖ్యంగా మా కుటుంబంలో మంచి పేరుంది. సామాజిక సేవ గురించి మాట్లాడుతుంటారు. అంతే. సామాజిక సేవ చేసినట్టు నాకు అనిపించలేదు. ఇష్టంగా ఉన్నట్టు కూడా నాకు అనిపించలేదు. నాన్న నా పేరున ఆదాయపు పన్ను మినహాయింపులు తీసుకుంటాడు. అమ్మ కూడా తీసుకుంటోందేమో నాకు తెలియదు. ఆదాయపు పన్ను మినహాయింపు మీద ఉన్న శ్రద్ధ నా మీద చూపించి ఉంటే నేనెప్పుడో బాగయి ఉండేవాడినేమో?

"నాన్న, అమ్మ నన్ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని కాదు, బెంగుళూరు, న్యూఢిల్లీ, హైదరాబాద్‌లోని బధిరుల కేంద్రానికి నన్ను తమ టూర్లమీద వెళ్తున్నప్పుడు కూడా తీసుకు వెళ్లి చూపించారు. అమ్మకు ఎప్పుడో గాని టూర్లు ఉండేవి కావు. నాన్నకు ఎక్కువగా ఉండేవి. అన్ని కేంద్రాలు చెప్పిన మాట ఒకటే. అది,విడవకుండా హియరింగ్ ఎయిడ్  వాడమని, స్పీచ్ థెరపీకి వెళ్తూంటే అందరిలా మాట్లాడగలనని చెప్పారని అమ్మ నాతో అంది. హియరింగ్ ఎయిడ్ కొన్నారు కాని బేటరీలది సమస్య అయింది. అవి మా ఊళ్లో దొరకవు. మునుపు హైదరాబాద్‌లో కూడా దొరికేవు కావు. బొంబాయి నుండి తెప్పించుకోవాలి. ఆర్డరిచ్చిన నెలకో, రెండు నెలలకో వచ్చేవి. కష్టపడి బేటరీలు తెప్పించినా రెండు మూడు సార్లు అవి స్కూల్లో ఎక్కడో జారిపోయేసరికి హియరింగ్

ఎయిడ్‌ను స్కూలుకు తీసుకువెళ్లనిచ్చేవాళ్లుకాదు. ఇంటి దగ్గర పిల్లలతో ఆడుకునేప్పుడు కూడా దాన్ని పెట్టుకోనిచ్చేవారు కాదు. అదేమిటని ఎవరయినా అడిగితే, 'ఈ బేటరీలు చాలా ఖరీదయినవండీ, బొంబాయి నుంచి తెప్పించడం ఇబ్బంది అయిపోతుందండీ. తీరా తెప్పించాక మావాడు వాటిని జాగ్రత్తగా ఉంచుకోడు. మావాడికి చెప్పీ చెప్పీ విసుగెత్తిపోయాము. నిజానికి మా వాడికి చెవుడులేదు. ఎడమెంటు. మీరు పిలిస్తే మీ పిలుపు వాడికిష్టమయితే పలుకుతాడు. లేకపోతే లేదు' అనేవాడు. నామీద నెపమో, తనను తను సమర్థించుకోవడమో నాకు అర్థమయ్యేది కాదు. అమ్మ మాటలుకూడా అలానే ఉండేవి.

"సమాజంలో స్థాయి, పరపతి కోసం ఆరాటపడే వ్యక్తి ఆమె. ఇళ్లస్థలాలు, బంగారం, పట్టుచీరలు, బంధువుల్లో పేరు ప్రతిష్టలు దాటి ఆమె తల బయట పెట్టదు. కావలసిన దానికంటే ఎక్కువే సంపాయించారు. ఇంకా దేనికోసం ఆరాటపడుతుంటారో నాకు తెలుసుకోవాలనిపించలేదు.

"నాకు ఏ విషయంలోనూ తక్కువ చేయలేదు, నేను ఎనిమిదో తరగతిలో ఉండగానే మోటర్ బయిక్ కొనిచ్చారు. నాన్న కొత్తకారు కొనుక్కున్నాడు. కారు నడపడం నేర్చుకున్నాను. నాన్న కంటే బాగా నేనే కారు నడుపుతాను. అమ్మకు రాదు. నేర్చుకోడానికి ప్రయత్నించలేదు. నాన్ననూ, అమ్మను వాళ్ల ఆఫీసుల్లో వదిలాక సాయంత్రం వాళ్ల ఆఫీసులు ముగింపు వేళల వరకు కారు నా చేతుల్లో ఉండేది. నాన్న ఆఫీసు వాళ్లు కారు పెట్రోలు బిల్లు భరించడం వలన కారును నా స్నేహితులతో కలిసి ఇష్టమొచ్చినట్టు తిప్పేవాడిని. నాన్న ఏమనేవాడు కాదు. నా స్నేహితులతో తిరిగితే నాకు మాటలు బాగా వస్తాయని నాన్న, స్పీచ్ థెరపీకి అయ్యే ఖర్చు మిగిలినట్టే అనుకునేవాడేమో.

"డబ్బు విషయంలో అమ్మానాన్నలు నిక్కచ్చిగా ఉంటారు. తమకు అవసరం అనుకుంటే తప్ప ఎదుటివారికి సహాయం చేయరు. ఎవరయినా బాకీ ఉంటే నిర్దాక్షిణ్యంగా వసూలు చేస్తారు. నేను వాళ్ల మీద అరుస్తాననేమో నా విషయంలో డబ్బు దగ్గర ఉదారంగానే ఉంటారు. అమ్మ మా బంధువులందరితోనూ బాగా మాట్లాడేది. నాన్న మటుకు తనకంటే తక్కువ ఉద్యోగస్తులయిన బంధువులతోనే మాట్లాడడానికి ఆసక్తి చూపించేవాడు. ఎవరితో మాట్లాడుతున్నా తన జీతం గురించి, వచ్చే పెర్క్స్ గురించి చెప్పడం మర్చిపోయేవాడుకాదు. బంధువుల దగ్గర హోదా, జీతాల ప్రసక్తి ఎందుకు తీసుకువస్తుంటాడో నాకు తెలియదు.

"మొదట్లో నన్ను ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్పించారు. అర్థం అయ్యేదికాదు. భరించడం కష్టమయి క్లాసుల్లోంచి పారిపోదామనిపించేది. చివరకు నేను స్కూలుకు వెళ్లనని మొండికేస్తే తెలుగు మీడియం స్కూల్లోకి మార్చారు. అక్కడ కూడా నేను నేర్చుకుందేమీ లేదు. తర్వాత ఒక ట్యూటరును పెట్టారు. చదువుకు కూర్చోడం అయితే కూర్చుండే వాడిని కాని చదువుమీద అట్టే ధ్యాస ఉండేదికాదు. ఎప్పుడు ట్యూషను అయిపోతుందా, ఎప్పుడు బయట పడి అలా ఊరంతా తిరిగి వద్దామా అనిపించేది. జిమ్‌లో చేరాక స్నేహితుల సంఖ్య పెరిగింది. విలాసాలకు బాగానే ఖర్చు పెట్టేవాడిని.

"ఎస్.ఎస్.సి. మూడో ప్రయత్నంలో కాని గట్టెక్కలేకపోయాను. సెంటర్‌లో చేర్పించారు. మిగిలిన విషయాల్లో ఎలా ఉన్నా చదువు గడ్డుగానే ఉంది. కారులో కాలేజీకి వెళ్లి రావడం బాగానే ఉంది. పాత స్నేహితుల్లో కొందరు నన్ను వదిలించుకున్నారు. కొంతమందిని నేను వదిలించుకున్నాను. కొత్త స్నేహితులు వచ్చారు. చాలామంది చదువు మీద ధ్యాస కలిగినవాళ్లు. ఒక విధంగా ఇంటర్ జీవితాలకు ఒరవడి నిర్దేశిస్తుందనుకుంటాను. నాకు మటుకు ఊపిరాడడం కష్టమయినట్టనిపించింది. ఎంచేతనో వాళ్లతో కలవలేకపోయాను.

"కొంతమంది నా ముందు మంచిగా మాట్లాడినా నా వెనక నవ్వేవాళ్లు. నా డిసెబిలిటీ గురించి అయి ఉండదు. నా అహం గురించి అనుకుంటాను. దాంతో పుట్టి పెరుగుతూ వచ్చాను. బయటకు రాలేను. ఇంటరు చదివాను కాని పూర్తి చేయలేదు. నావలన అవుతుందని అనుకోవడం లేదు. కొన్నాళ్లపాటు కంప్యూటర్ హార్డ్‌వేర్ నేర్చుకుందామని ఒక సెంటర్‌లో చేరాను. రెండు నెలలు కష్టపడినా ఏ మాత్రం వంటబట్టలేదు. చివరిగా నా దృష్టి కంప్యూటర్ ఏనిమేషన్ మీదకు మళ్లింది. అందులో చేరాను.

"ఏనిమేషన్ కోర్సు చేస్తూ వికలాంగుల కేంద్రంలో స్పీచ్ థెరపీకి వెళ్తున్నప్పుడు నాకు కృష్ణతో పరిచయం అయింది. కృష్ణ పూర్తి పేరు కృష్ణవేణి. ఆమె నాలాటి బధిర. ఇరవయి రెండేళ్ల వయసుంటుంది. చెప్పుకోదగిన అందగత్తేమీ కాదు. అయినా నాకు నచ్చింది. మా ఇద్దరికీ పరిచయమయి నాలుగు నెలలు కాక ముందే ఇద్దరం దగ్గరయ్యాం. సెలవురోజుల్లో తప్ప కృష్ణను చూడని, మాట్లాడని రోజు లేదు. స్పీచ్ థెరపీ క్లాసు అయిపోగానే కారులోనో, నా మోటర్ బయిక్ మీదనో నేను ఆమెను ఏ పార్కుకో, హోటల్‌కో తీసుకు వెళ్లేవాడిని. రోజులో కనీసం మూడు గంటలపాటు

కబుర్లు చెప్పుకుంటుండేవాళ్లం. ఆ తర్వాత నేనే ఆమెను తీసుకు వెళ్లి వాళ్ళింటి సమీపంలో వదిలిపెట్టి వస్తుండేవాడిని. వాళ్లింటికి రమ్మని కృష్ణ నన్నెప్పుడూ ఆహ్వానించలేదు. మా ఇంటికి ఆమెను పిలవలేదు. నా విషయాలు ఆమెకు చెప్పాను. తన విషయాలు, ఒక్కటికూడా నాకు చెప్పలేదు.

"మా కేంద్రానికి వారానికి ఒకసారి డాక్టరు జయకర్ వచ్చి మమ్మల్నందరినీ పరీక్షించే వాడు. బధిరుల చెవులకు సున్నితమయిన ఇంప్లాంటేషన్ ఆపరేషన్ చేయడంలో ఆయన నిపుణుడు. ఆయన ఇప్పటివరకు చాలా ఇంప్లాంటేషన్ ఆపరేషన్లు చేసి వినలేని వాళ్లకు వినిపించేలా చేసిన సంగతి మీకు తెలుసు. కాకపోతే ఆ పరికరం ఇక్కడ దొరకదు. విదేశాలనుంచి తెప్పిస్తారని విన్నాను. ఖర్చుతో కూడిన పని. డబ్బున్న వాళ్లదగ్గర ఎక్కువే వసూలు చేస్తారనీ లేనివాళ్ల దగ్గరనుండి అట్టే తీసుకోరని విన్నాను. నాన్నను తీసుకు వచ్చి ఆయనకు పరిచయం చేశాను. అయిదు లక్షలవుతుందని అన్నారు డాక్టరు. అయిదు లక్షలు నాన్నకు పెద్ద మొత్తమేమీ కాదు, అయినా వెనక్కి తగ్గాడు. డాక్టరుతో మాట్లాడి బయటకు వచ్చాక, 'ఇంప్లాంటు చేసినా మాటలు వినబడతాయని గట్టిగా చెప్పడంలేదు. వినబడక పోతే వేస్టేకదా?' అన్నాడు నాన్న. డాక్టరు నిజంగా అన్నాడో, నాన్న అలా ఊహించాడో నాకు అర్థం కాలేదు. అమ్మ కూడా ఎటువంటి ఆసక్తి చూపించలేదు.

"చిన్నప్పటి నుండి ఇలా జీవించడం అలవాటయినందు వలనేమో, నాకు బధిర జీవితమే మంచిగా ఉన్నట్టు అనిపించింది. మూడు వారాల తర్వాత, పదిరోజుల్లో తనకు ఇంప్లాంటేషన్ జరగబోతుందన్న వార్త కృష్ణ చెప్పినప్పుడు సీరియస్‌గానే తీసుకున్నాను. 'నాకు చెప్పకుండా ఇన్ని రోజులు ఎందుకు దాచావు?' అడిగాను. నవ్వి, 'నిన్ను ఆశ్చర్యంలో ముంచెత్తుదామని చెప్పలేదు' అంది. 'చాలా డబ్బులవుతాయిగా' అన్నాను. 'లయన్స్‌క్లబ్ వాళ్లు సహాయం చేస్తానన్నారు' అంది. ఆ పూట కృష్ణతో ఎక్కువసేపు మాట్లాడాలనిపించలేదు. ఆమె నాకు దూరం అవుతున్నట్టు అనిపించడం మొదలెట్టింది. ఆమెకు ఇంప్లాంటేషన్ ఆపరేషన్ జరిగి సఫలమయితే ఆమెకు మాటలు వస్తాయి. నన్ను పట్టించుకోవలసిన అవసరం ఉండదు. నేను ఎవరిగానో మిగిలిపోతాను. నాకు నిద్రపట్టడం మానేసింది. కృష్ణను వదులుకోదల్చుకోలేదు.

"రెండు రోజుల్లో కృష్ణకు ఆపరేషన్ అనగా ఆ సాయంత్రం డాక్టరు జయకర్‌గారి దగ్గరకు వెళ్లాను. మీరు మాట్లాడినట్టు బధిరులతో చక్కగా, నవ్వుతూ మాట్లాడతాడు.

వ్యక్తి మంచివాడు. ఆయనంటే నాకు గౌరవం ఉంది. అయిదు నిమిషాలపాటు నా స్పీచ్ థెరపీ గురించి మాట్లాడాక అసలు విషయానికి వచ్చాను. 'నాదో విన్నపం' అన్నాను. 'ఏమిటద'ని అడిగాడు. 'కృష్ణకు ఆపరేషన్ చేయకండి' అన్నాను. 'ఎందుకు?' అడిగాడు. నా మనసులో ఏం దాచుకోలేదు. ఒక్కటీ విడవకుండా అన్నీ చెప్పాను. విని, చాలాసేపు మవునంగా ఉండి, తల అడ్డంగా ఆడించి 'వీలుకాదు' అన్నాడు. ఆ మాటకు నాకు కోపం రాలేదు. 'అయినా అడగడానికి నువ్వు ఎవరివో చెప్పు' అడిగాడు. ఆయన అడిగింది తప్పేమీ కాదు. నిజానికి నేను కృష్ణకు ఏమీ కాను. ఆపరేషన్ కాకపోతేనే నేను ఏమయినా అవుతాను. పరిస్థితి చేయిజారిపోతున్నట్టు అనిపించింది. చటుక్కున లేచి ముందుకు వంగి ఆయన భుజం పట్టుకుని మరో చేత్తో జేబులోంచి కత్తి బయటకు తీశాను. ఆయన్ని ఏం చేద్దామనికాదు. భయపెట్టాలని... అసలు కత్తి తీసుకురాకుండా ఉండాల్సింది...." అతను ఆగాడు....

అవును, జరగకుండా ఉండాల్సింది అనుకున్నాను. అతను చెప్పినవన్నీ స్టేట్‌మెంట్‌గా తయారు చేసి అతని సంతకం తీసుకుంటే నన్ను పిలిపించిన పనయిపోతుంది. అతని ముఖంలోకి చూసి జేబులోంచి సిగరెట్ పేకట్ తీసి, ఒక సిగరెట్ తీసి వెలిగిస్తోంటే,

"నాకూ ఒక సిగరెట్ ఇస్తారా, ఇక్కడ తాగొచ్చా" అడిగాడు.

"తాగొచ్చు" మరో సిగరెట్ తీసి అతనికి ఇచ్చి "సిగరెట్ తాగే అలవాటుందా లేక ఇదే మొదటిసారా?" అడిగాను.

"అప్పుడప్పుడు తాగుతుంటాను" సిగరెట్ పెదాల మధ్య పెట్టుకున్నాక లయిటరుతో సిగరెట్ వెలిగించాను.

అతని చేతులకు బేడీలు ఉన్నాయి.

"డాక్టరు జయకర్‌గారికి ఎలా ఉంది?" అడిగాడు.

నిట్టూర్చి, "డాక్టరుగారి కుడిచేతి బొటన వేలు, చూపుడువేలు చివరి కణుపులు తెగి పోయాయి. అతికించికుట్టారు ముందు ముందు ఆయన ఏ ఆపరేషన్ చేయలేక పోవచ్చు. నువ్వు కత్తిని ఆయన గొంతుకు గురి పెట్టావనుకుంటాను, స్వరపేటికకు గాయమయింది. ఇహ ఆయన మాట్లాడలేడేమో" అన్నాను.

❖ ఆదివారం వార్త, ఆగస్టు 2, 2009